# మా ఇళ్లకాడ గెనిసిగెడ్డల సందడి

ఎండాకాలం వొచ్చిందంటే మా అమ్మకి నీళ్ల బయం కంటే ముందర దొంగల బయం పట్టుకుంటుంది.

ఆ సీజనులో ఉక్కకి గాలాడక అందరం ఇళ్ల బయటే పొణుకొని ఉంటే దొంగలు హాయిగా యిళ్లల్లోకి దూరి లోపల్లోపలే అంతా మూటగట్టుకొని పోతారని మా తాత మా అమ్మకి చెప్పేవాడంట... అందుకని బయం.

దానికి తోడు, మా జరీనాంటీ పొద్దన్నే మా యింటికి కిరసనాయిలి అప్పు కోసం వొచ్చి 'ఆపా. దోసెలుబోసే పిచ్చమ్మకాడ అందరూ చెప్పుకుంటా ఉండారు. కత్తిరోళ్ల బ్యాచీలు నాలుగు దిగున్నాయంట ఊర్లో. వోళ్లు పూసలమ్మేవోళ్ల పేరున, సవరాలు కట్టే వోళ్ల పేరున యీదుల్లో తిరగతా ఉన్నారంట. మంచి మంచి యిళ్లని ముందరే గుర్తుపెట్టు కొని రాత్రిళ్లు దొంగతనాలు చేస్తా ఉన్నారంట. జాగ్రత్తగా ఉండు. దూలేజాన్‌ను కూడా హెచ్చరించు. పెందలాణ్ణే యింటికి చేరుకోమని చెప్పు' అని యింకాస్త బయపెట్టి పోయేది.

ఆ దెబ్బకి మా అమ్మకి బయం యింకా పెరిగిపోయేది.


కారణం ఏమిరా అనంటే మేముండే పోలేరమ్మబండకాడ పొగులు పొద్దస్తం ఎంత కళకళగా ఉంటుందో రాత్రిళ్లు అంత గబ్బగియ్యంగా ఉంటుంది. అసలే మా పాతూరులో ఉండేది అందరూ రెడ్లూ, సేద్యం చేసేవాళ్లూ, పాలుపిండుకుని అమ్ముకునే వాళ్లూ.

వాళ్లందరూ లేటుగా మేలుకునే రకాలు గాదు. వాళ్ల ఆడోళ్లు కూడా పొద్దున్నే నాలు గ్గంటలకి లేచి, యిళ్ల ముందర కసువు చిమ్ముకొని, కళ్లాపి చల్లుకోమంటే చల్లుకుంటారు గానీ రాత్రి ఎనిమిది దాటాకా చేతిలో లక్షరూపాయలు పెట్టినా ఎగస్ట్రా టైము మేలుకోరు.

అందుకని రాత్రి ఎనిమిదీ ఎనిమిదిన్నరకంతా మా పాతూరంతా దీపాలు ఆరిపోయి కిర్రుకిర్రుమంటా ఉంటుంది.

ఆ కిర్రుకిర్రుని చూస్తే మా అమ్మకి యింకా బయం.

'చూసినావా? చీమ చిటుక్కుమనడం లా. పిట్ట రెక్కాడించడంలా. ఎవురైనా వొచ్చి



గొంతు కోసి ఎళ్లినా అడిగే దిక్కులేదు. వద్దు నాయనా వద్దు. మనం బయట పొణుకో వద్దు. పైన పొణుకోవద్దు. ఇంట్లోనే పొణుకుందాం' అంటుంది ఫైనలు మాటగా.

మా అమ్మ మాటని మా నాయన కాదనడానికి లా.

అయితే హీరింగుకి ఒకటి రెండు మాటలు అనవచ్చు. మా నాయన అదే అంటాడు.

'ఏమ్మే. ఏంది నువు మాట్లాడేది. కరీంసాయెబేంది... వాడి సంపాదన ఎంత. వాడి కాడ లిబ్బి ఏమాత్రం మూలగతా ఉంటుంది. ఈ సంగతి ఊరంతా తెలియదా? మనింటికి దొంగలెవురొస్తారు. ఒకాల వొచ్చినా వాళ్లని కూచోబెట్టి టీ గీ యిచ్చి మన బాదలు చెబితే ఎదురిచ్చేసిపోతారుగానీ...' అనేవాడు నవ్వతా.

వాస్తవానికి ఆయన బాద వేరు.

కష్టపడి శ్లాబుబోసి మిద్ది కట్టించానుగదా, పైన సదరపుబిళ్లలు పరచి సదరం చేయించా నుగదా, ఈ ఎండలుగాసే కాలాన చెంబెడు నీళ్లు పక్కన బెట్టుకొని ఆకాశం తట్టు చూస్తా సముద్రం పక్క గాలికి హాయిగా నిద్దరపోవచ్చు గదా అని ఆయన బాద. మా బాద కూడా అదే.

అయినా గానీ మా అమ్మ యినదు.


పోలేరమ్మబండ కాడికి గెనిసిగెడ్డలోళ్లు వచ్చేదాకా 'ఊ' అనదు.

వాళ్లొచ్చి దిగి, కలబిల కలబిలమని సందడి చేస్తేగానీ మా అమ్మకి ధైర్యం రాదు.

ఇంతకీ ఈ గెనిసిగెడ్డలోళ్లు ఎవురయ్యా అనంటే పాపం అమిత బీదోళ్లు.

మా కావలి చుట్టుపక్కల, అంటే కనిగిరి ఆ పక్కతట్టుండే సత్తెనాశినం బూముల్లో వరి పండక గెనిసిగెడ్డలని పండించుకుని బతికే అన్యాలం రైతులు.

సంవచ్చరానికి ఒకతూరి మందలు మందలుగా ఎద్దలబండ్ల మీద గెడ్డలేసుకొని చుట్టా ల్లాగా వస్తారు మా పక్కకి. వారం పదిరోజులపాటు వాళ్లు ఎక్కడ దిగితే అక్కడే హాల్టు. పిల్లా జెల్లా ముసలీ ముతకా అందరూ ఆణ్ణే.



మా సైడు ఎండలు ముదిరే టయానికి అందరి యిళ్లకి వడ్లు చేరి ఉంటాయి గదా అయి కావాలి వీళ్లకి. వడ్లు యిస్తే గెడ్డలు యిస్తారు. మారుబేరం అన్నమాట. డబ్బుల కోసరం అమ్మడం కంటే వడ్లకు మార్చుకోవడం మీదే వీళ్ల ఆశ- తిండి గింజలు కాస్త ఎక్కువ వస్తాయి గదా అని.

వీళ్ల లెక్కలు గూడా తమాషాగా ఉంటాయి.

శేరెడు వడ్లకి ఈసెడు గడ్డలు. మానెడు వడ్లకి బుట్టెడు గడ్డలు.

యిళ్ల ఆడోళ్లు, పిలకాయలు గెడ్డల కాడ కూచొని ఉంటే మొగోళ్లు కావిళ్లు బుజాన ఏసుకొని, గెనిసిగెడ్డల మూటలు బెట్టుకొని 'గెనిసిగెడ్డలో గెనిసిగెడ్డలో' అని అరస్తా పోతారు ఊరిలోకి.

పొద్దుపోయేదాకా తిరుక్కని తిరుక్కొని మళ్లా హోల్టు కాడికి చేరుకున్నాక ఇంక రాత్రి పదకొండు పన్నెండుదాకా పొయ్యి రాజేసుకుంటా, అన్నం ఉడికించుకుంటా, ఆ మాట ఈ మాట మాట్లాడుకుంటా, పద్యాలు పాడుకుంటా, చుట్టలు పీక్కుంటా ఒకటే గలబా.

ఆ గలబా ఉంటే దొంగలు రారని మా అమ్మకి ధైర్యం.

'ఇంక పదండి మిద్దెపైకి ఎళ్లి పొణుకుందాం' అంటుంది చాపెత్తుకొని.

పోలేరమ్మబండకాడికి గెనిసిగెడ్డలోళ్లు వస్తే మాకు లబించే ఈ బాగ్యం బాగానే ఉంది గానీ కాండూరి మురళీవాళ్లకి మాత్రం బలే అవస్త. ఏమంటే గెనిసిగెడ్డల దెబ్బకి పందికుక్కలు చేరతాయి గదా అయి గెడ్డల జోలికి మాత్రమే పోయి అంతటితో ఊరుకోకుండా ఆ పక్కనే ఉన్న మా మురళీ వాళ్లింట్లోకి రాత్రిళ్లు దూరేయి.

ఇంక వాళ్లింట్లో దడాబడామని శబ్దాలు. దాంతో పొద్దున్నే తగవు. నిద్ర చెడి మురళీ వాళ్ల తాత పూనకం వచ్చినోడిలాగా తయారయ్యేవాడు.

'మీకు యిరవైనాలగ్గెంటలు టయం యిస్తా ఉన్నా. ఈలోపు యీణ్ణుంచి పొయ్యారో మంచిమాట. లాకుంటే నా సంగతి తెలుసుగా. మంత్రం చదివానంటే బుగ్గయిపోతారు

లమిడీల్లాలా' అని ఆయన పోలేరమ్మ బండకాడికి వచ్చి ఉగ్రంగా నిలబడి అరస్తా ఉంటే పాపం గెనిసిగెడ్డలోళ్లు ఒంటేలు పోసుకునేవాళ్లు.

మురళీ వాళ్ల తాతంటే సామాన్యుడా? పూజారి. ఆయనకి అనేక యిద్యలు వచ్చని చాలా మందికి తెలుసు. అదీగాక ప్రెతి శుక్కరోరం ఆయన ప్రశ్న చెబుతాడు. అంటే గొడ్డు తప్పిపోయిందనో, బిడ్డ తప్పి పోయిందనో, తాళాలు పోయాయనో, వస్తవ మాయం అయ్యిందనో వచ్చేవాళ్లకి ఆయన ప్రశ్న చూసి సమాదానం చెప్పి పంపిస్తా ఉంటాడు. ఆయన చెప్పిన మాట పొల్లుపోదని అంటారు.

అట్టాంటి మనిషి మంత్రం పెడతానంటే బయం పట్టుకోదా?

గెనిసిగెడ్డలోళ్లు అదిరిపోయేవాళ్లు.

'అయ్యగారా అయ్యగారా. సచ్చి మీ కడుపున పుడతాం అయ్యగారా. మంత్రం బెట్టకు అయ్యగారా. నాలుగు దినాల్లో ఎళ్లిపోతాం అయ్యగారా' అని బతిమిలాడుకునేవాళ్లు ఆయనని.

'కుదరదు. మీ వల్ల పందికుక్కల బాదలే కాదు యింకా చాలా ఉన్నాయి. మీ ఆడోళ్లు మంచినీళ్ల కోసరమని మా యింట్లోకి దూరతా ఉన్నారు. మా మంచాలు తాకి మైల చేస్తా ఉన్నారు. మీరీణ్ణుంచి బోవలసిందే. డాండూం' అని మురళీవాళ్ల తాత అరిచేసరికి పాపం యింకా బయపడిపొయ్యేవోళ్లు గెనిసిగెడ్డలోళ్లు.

'అయ్యగారా అయ్యగారా. నీకు కావాలంటే ఎన్ని గెడ్డలైనా తీసుకో అయ్యగారా. ఏదైనా పనుంటే చెప్పు అయ్యగారా. చేసిపెడతాం. అంతేగాని మా పొట్టగొట్టకు అయ్య గారా' అని కాళ్లావేళ్లా పడేవాళ్లు.

మురళీవాళ్ల తాత వాళ్ల వైపు పొడుగ్గా చూసి 'నాకు గెడ్డలుబల్లా గిడ్డలు బల్లా. యింకోక్క సారి పందికుక్కలు మా యింట్లోకి దూరినాయో...' అని ఎళ్లిపోయేవాడు.

ఆ దెబ్బకి రెండురోజులపాటు గెనిసిగెడ్డలోళ్లు రాత్రిళ్లు కొరివి కట్టెలు ఎలిగించుకొని దొరికిన పందికొక్కుని దొరికినట్టు చంపి వొదిలినారు. అంతటితో వాళ్లకి పందికుక్కల బయం పొయ్యిందిగానీ మురళీవాళ్ల తాతంటే బయం పోలా. ఆయన ఆ దోవన పోయిన ప్పుడల్లా లేచి చేతులు నలపుకుంటా బయం బయంగా ఆయన తట్టే చూస్తా ఉండేవాళ్ళు పాపం.

అదంతా చూసి నాకూ మా మురళీగాడికీ బలే బాదగా అనిపించేది.

వాళ్ల గెడ్డలు ఎంత బాగుంటాయి. ఎంత తియ్యంగుంటాయి. ఎర్రమట్టి గెడ్డలది ఒక రుచి. నల్లమట్టి గెడ్డలది ఒక రుచి. పలచగా పొడుగ్గా ఉండే లేతగెడ్డలని కుళాయి కింద కడుక్కొని పరాపరా నమలతా ఉంటే నోటికి అదో రుచి. నిప్పుల్లో కాల్చి తింటే ఎంత కమ్మన. ఉడకబెట్టుకొని తింటే ఎంత మెత్తన.

మా అమ్మ గెనిసిగెడ్డలతో పాయసం చేస్తుంది. ఎంత బాగుంటుంది. మురళీవాళ్లింట్లో వాటితో అన్నంలో కలుపుకునే కూర కూడా చేస్తారంట. చూడబోతే అది కూడా బాగానే ఉండేట్టుంది. ఈళ్లుంటే మాకు యింత బాగా ఉందిగదా పాపం యీళ్లకు మావల్ల బాదలు వస్తా ఉన్నాయే అనుకున్నాము.

రోజులు పోతా ఉండేయి. గెనిసిగెడ్డలోళ్ల కాడ గెడ్డలు కరిగి వడ్ల మూటలు పెరగతా ఉండేయి. అది చూసేకొద్దీ మాకు దిగులు. యింకొన్ని రోజులకి యీళ్లు ఎళ్లిపోతారు గదా

అని, ఈ సందడంతా పోతుంది గదా అని...

ఒకరోజు రాత్రి తొమ్మిదీ తొమ్మిదిన్నరకి మా అమ్మా నాయనా పిలకాయలం అందరం చాపలు, దిండ్లూ ఎత్తుకొని మిద్దెమీదికి పొణుకోడానికి పోతా ఉంటే గెనిసిగెడ్డలోళ్ల కాడ పెద్ద గలాటా. ఆడోళ్లు ఏడస్తా ఉంటే, మొగోళ్లు గీ బా అని అరస్తా ఉన్నారు. అది చూసి, చాపా దిండూ అణ్ణే పారేసి మా అమ్మ ఒరే ఒరే అంటా ఉన్నా లగిత్తాను ఆడకి.

వాళ్లల్లో ఒకడికి తేలు కుట్టింది. గెడ్డల్లో ఎట్ట చేరిందో ఏమో చేరి ఒకణ్ణి కుట్టేసింది. లాంతరు ఎలుగులో దాన్ని చూసి నలిపేశారుగానీ నొప్పికి అల్లాడతా ఉన్నాడు మనిషి. కళ్లమ్మట నీళ్లు కారతా ఉన్నాయి. అది యిషం తేలని ఒకరు, పోతాడేమోనని ఒకరు గాబరా గాబరాగా ఉన్నారు. ఆ టయంలో పాపం ఆ ఊరుగాని ఊరోళ్లు యాడికి పోతారు? ఏ ఆస్పత్రికి లగెత్తతారు?

సరిగ్గా ఆ టయానికే దేవుడిలాగా వచ్చినాడు మురళీవాళ్ల తాత.

'ఏందా గలబా?' అన్నాడు సొక్కా లేని ఒంటి మీద కండువ సర్దుకుంటా నిద్రకళ్లతో.

'తేలు కుట్టింది అయ్యగారా. మీరే దిక్కు అయ్యగారా. అయ్యగారా అయ్యగారా' అన్నారు గెనిసిగెడ్డలోళ్లు.

మనిషిని తాకొచ్చో కూడదో అని బయపడిగానీ లాకుంటే వాళ్లంతా ఆయన కాళ్ల మీద పడేటట్టుగా ఉన్నారు.

తేలుమాట వినగానే మురళీ వాళ్ల తాత మొకంలో నిద్రపొయ్యింది. మొకం మార్చి, చెయ్యెత్తి అబయం లాగా చూపించి తేలు కుట్టిన మనిషి కాడికి వెళ్లాడు చురుగ్గా.

'ఒరే. నీ పేరేంది?' ఆ మనిషిని అడిగాడు.

'ఎంకయ్య బాబో' నొప్పితో మూలగతా అన్నాడు మనిషి.

'ఒరే ఎంకయ్యా. నేనొచ్చా. బయం లేదు' అని, మడి ఆచారం వదిలి, గబక్కన తేలు కుట్టిన కాడ కాలు గట్టిగా పట్టుకొని వత్తి, సున్నంబొట్టు పెట్టి, యాపాకుమండ తుంచి మంత్రం చదివి మూడుసార్లు తిప్పి అవతల పారేశాడు.

ఆ తర్వాత ఆ మనిషి వీపున దబ్బుమని ఒక చరుపు చరిచి 'ఒరే ఎంకయ్య. పొయ్యింది పో' అన్నాడు.

తెల్లారింది. ఆ మనిషి నవ్వతా లేచి నిలబడ్డాడు.

అది చూసి గెనిసిగెడ్డలోళ్లు ఆ దోవన పోతా ఉన్న మురళీవాళ్ల తాతకాడికి పొయ్యి కళ్లమ్మట నీళ్లు పెట్టుకొని 'మహానుబావులయ్యా తమరు' అని కాళ్ల మీద పడబోతే ఆయన వాళ్లని వారించి, పైకి చేతులు చూపిస్తా 'ప్రాప్తం రా' అని వెళ్లిపోయినాడు.

మేము పెద్దవాళ్లమయ్యి కాలేజీలకి వెళ్లే దాకా ప్రైతి సంవచ్చరం గెనిసిగెడ్డలోళ్ల సందడి మాకు ప్రాప్తంగా ఉండేది.

ఇప్పుడు వాళ్లు రావడమే లా. ఏమయ్యారో!

■

* గెనిసిగెడ్డలని కొందరు చిలకడదుంపలని అంటారు.